క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే కాటసాని ఎన్నికల ప్రచారం

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోవెలకుంట్ల మండలంలో గురువారం ప్రచారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. అమడాల, సౌదరదిన్నె, గుంజలపాడు, పొట్టిపాడు, కంపమల్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం, రోడ్‌షో కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నవాబు వంశీయులను కలిసిన కాటసాని ఓబులరెడ్డి



నవాబువంశీయులతో మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : బనగానపల్లె పట్టణం దొరకోటలోని నవాబు వంశీయులు నవాబుమీర్ హైదర్ అలీఖాన్, ఆయన కుమారుడు మీర్‌జవర్ అలీఖాన్‌ను బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న తనతండ్రి కాటసాని రామిరెడ్డికి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ మైనార్టీ యువజన విభాగం అధ్యక్షుడు అఖిల్‌హుస్సేన్, డాక్టర్ నిస్సార్, డ్రైవర్ అబ్బాస్, ఇక్బాల్, అన్వర్, హదీఅలి, జాహీర్‌అబ్బాస్, హాజీహుస్సేన్, ముర్తుజాహుస్సేన్, అల్లిఅబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆ నల్గురు స్వచ్ఛంద సేవలు అభినందనీయం

బేతంచెర్ల: అనాథ మృత దేహాలకు సొంత కుటుంబ సభ్యుల్లా అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నల్గురు స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని బృందావన్ భారత్ గ్యాస్ నిర్వాహకుడు బుగ్గన రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సంస్థ సేవలను అభినందిస్తూ అధ్యక్షుడు వస్నూర్ బాషాకు బుగ్గన రమణారెడ్డి తనవంతు సాయంగా రూ. 20వేల అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అల్తాఫ్, రాఘవేంద్ర, మా భాష పాల్గొన్నారు.

ఘనంగా రామస్వామి రాజా జయంతి

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్స్ స్థాపకుడు పీఏసీ రామస్వామి రాజా 130 జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వర స్వామి ఆలయం నుంచి కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వరకు ప్లాంట్ హెడ్ రెడ్డినాగరాజు, ప్రెసిడెంట్ అడ్మిన్ రామరాజు ఇతర ప్రతినిధులతో కలిసి జ్యోతితో ర్యాలీ నిర్వహించారు. జయంతిని పురస్కరించుకొని బనగానపల్లెలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి, సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు.

అనాథ సాధువు మృతి

బనగానపల్లె రూరల్ : స్థానిక పెట్రోల్‌బంకు సర్కిల్‌లో ఉన్న బస్సు స్టాప్ సెంటర్‌లో కానుగచింత కృష్ణారెడ్డి(74) అనే అనాథ సాధువు బుధవారం మృతి చెందారు. భిక్షాటను చేసుకుంటూ బస్టాప్‌లో పడుకునేవాడు. మృతుడి ఆధార్ కార్డులో కానుగ చింతకృష్ణారెడ్డి, యాగంటి దేవస్థానం కేరాఫ్ చిరునామాతో వివరాలు ఉన్నాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాదంలో ఎండుమిర్చి దగ్ధం

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడు గ్రామానికి చెందిన రైతు పెద్దరామిరెడ్డికి సంబంధించిన ఎండుమిర్చి విద్యుత్ ప్రమాదంలో దగ్ధమైంది. బాధిత రైతు సమాచారం మేరకు.. మంగళవారం రాత్రి పది క్వింటాళ్ల ఎండుమిర్చిని మినీ లారీలో గుంటూరుకు తరలిస్తుండగా గోస్పాడు మండలం తేళ్లపురి సమీపంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి లారీలో మంటలు చెలరేగాయి. మంటలకు ఎండు మిర్చి కాలిపోతుండటంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో రూ. 10 లక్షల విలువ మిరప దిగుబడులు కాలిపోయినట్లు బాధిత రైతు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు

డోన్ టౌన్ : ఎస్సీ వర్గీకరణ విషయంలో మళ్లీ మోసం చేసేందుకు మభ్యపెడుతున్న టీడీపీ, బీజేపీలకు గుణపాఠం చెప్పేందుకు వైఎస్సార్‌సీపీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాజుమాదిగ, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరరాజు మాదిగ తెలిపారు. మూడు రోజుల క్రితం నంద్యాల పట్టణంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, మాదిగలతో పాటు ఉపకులాలు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని వారు పిలుపునిచ్చారు.

అవకాశవాదులకు బుద్ధి చెప్పాలి

- గతంలో ఏమాత్రం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసు
- కోట్ల భూటకపు మాటలు మానుకోవాలి
- లద్దగిరికి రోడ్డు ఎందుకు వేయించలేదో చెప్పండి?
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఎన్ రంగాపురంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బుగ్గన

ప్యాపిలి: అవకాశవాద టీడీపీ నాయకులకు ప్రజలే బద్ధి చెప్పాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో డోన్ నియోజకవర్గానికి ఏమాత్రం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. మండల పరిధిలోని బావిపల్లి, ఎన్ రంగాపురం, కలచట్ల, ఎస్ రంగాపురం, ఎర్రగుంట్ల గ్రామాల్లో మంత్రి బుగ్గన బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో మంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గత 15 సంవత్సరాలుగా డోన్‌ను విడిచిపెట్టి వెళ్లిన 'కోట్ల' ఇప్పుడు వచ్చి భూటకపు మాటలు చెబుతూ ప్రజలను మభ్య పెడుతున్నాడని విమర్శించారు. కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి తాను పుట్టిపెరిగిన లద్దగిరి గ్రామానికి ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలియజేయాలన్నారు. లద్దగిరి–కోడుమూరు రోడ్డు వేసుకోలేని కోట్ల డోన్‌లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కోట్ల మాటలు వింటుంటే 'కన్నతల్లికి పిడెకెడు అన్నం పెట్టనివాడు..పిన్నికి మాత్రం బంగారు గాజులు చేయిస్తానని' నమ్మబలికినట్లు ఉందన్నారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక మంత్రిగా డోన్ నియోజవకర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దానని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి డోన్‌పై ప్రత్యేక శ్రద్ధ ఉన్నందునే ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు. దశాబ్దాలుగా రాజకీయ ఉద్దండులు చేయలేని అభివృద్ధి తాను కేవలం ఐదేళ్లలో చేసిచూపానన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు అవకాశవాదులకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అభివృద్ధి చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి అధికారం కల్పిస్తే ఇంతకు మించి చేసి చూపుతామన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని, డోన్ ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ప్యాపిలి ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, ఎన్ రంగాపురం, కలచట్ల సర్పంచులు జెర్రిబండ సుబ్బారెడ్డి, రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కమతం భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రజనీ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజామురళీకృష్ణ, చిన్న సుంకయ్య, రామచంద్రారెడ్డి, కొండయ్య, ఉమేశ్ యాదవ్, రామ్మూర్తి, జయరామయ్య, బాబయ్య, బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు!

- ప్రహరీ నిర్మాణాన్ని వెంటనే ఆపండి
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



డోన్ ప్రహరీ వద్ద రైల్వే అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

డోన్ : పట్టణంలోని నంద్యాల రైల్వే గేటు నుంచి బేతంచెర్ల వైపు వెళ్లే ప్రధాన రహదారికి అడ్డుగా రైల్వే అధికారులు ప్రహరీ నిర్మించడంపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానికుల అభ్యర్థన మేరకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో కలిసి ప్రహరీని నిర్మిస్తున్న స్థలాన్ని మంత్రి పరిశీలించారు. వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుండే ఈ రహదారిపై రైల్వే శాఖ కొత్తగా ప్రహరీని నిర్మించడం ప్రజలకు ఇబ్బందులకు కలగజేయడమేనని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కొత్తగా నిర్మించిన డబుల్ లైన్‌కు మూడు మీటర్ల దూరంలో మాత్రమే ప్రహరీని నిర్మించి బేతంచెర్ల రహదారిపై వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగించేందుకు సహకరించాలని మంత్రి బుగ్గన రైల్వే అధికారులను కోరారు. ఈ సందర్భంగా మంత్రి గుంతకల్ డివిజన్ రైల్వే డీఈ ఉన్నం అక్కిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రహరీ వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తెలిపారు. మంత్రి సూచన మేరకు ప్రహరీ నిర్మాణాన్ని ఆపివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రహరీని నిర్మించేందుకు పరిశీలిస్తామని తెలిపారు. అదేవిధంగా ప్రహరీ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని మంత్రి బుగ్గన సూచన మేరకు బుధవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ గుంతకల్ డివిజన్ రైల్వే డీఈ ఉన్నం అక్కిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బావిపల్లి గ్రామం టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన జలదుర్గం టీడీపీ నాయకులతో మంత్రి బుగ్గన

ప్యాపిలి: ప్యాపిలి మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ కొనసాగుతూనే ఉంది. బావిపల్లి, జలదుర్గం గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఎన్నికల ప్రచారం నిమిత్తం బావిపల్లి గ్రామానికి వచ్చిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమక్షంలో వారు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. బావిపల్లి గ్రామానికి చెందిన తలారి కృష్ణమూర్తి, అరవ వెంకటరాముడు, తలారి రామలింగన్న, తలారి రాజు, లింగమయ్య, వెంకటేశ్, ప్రసాద్ తదితరులతో పాటు 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. అదేవిధంగా జలదుర్గం గ్రామానికి చెందిన శ్రీరాములు, పెద్దన్న, కృష్ణమూర్తి, కంబగిరి స్వామి, రామకృష్ణ, కొచ్చెర్వు శ్రీనివాసులుతో పాటు మరో 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వారికి మంత్రి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీని నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, పార్టీ విజయానికి అంకితభావంతో కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గద్దం భువనేశ్వర్ రెడ్డి, పోదొడ్డి కృష్ణమూర్తి, రాజశేఖర్‌రెడ్డి, దస్తగిరి, వేమిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి, మద్దయ్య యాదవ్, సోమశేఖర్, ఎల్లయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి



ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బెలుం శింగవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో ఎన్నోఏళ్లుగా నెలకొన్న సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో దోచుకోవడం తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికలు రావడతంతో ప్రజలను మోసగించేందుకు టీడీపీ నాయకులు వస్తున్నారని, వారి మాయ మాటలు నమ్మొద్దని కోరారు. మే13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు బాలకంబయ్య, గోపాల్‌రెడ్డి, కోటా నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, రాంశంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, కంబగిరిరాముడు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల ఆర్థికస్థితి మెరుగు



రైల్వే కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా కౌన్సిలర్లు, నాయకులు

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయని మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ పేర్కొన్నారు. మహిళా కౌన్సిలర్లు ఇతియాజ్ కాలేషా, కురుకుంద పద్మావతి, బోయ సుమలత, మిట్టా ఉమామహేశ్వరి, బుర్రు రమాదేవి, శివలక్ష్మి, పాలుట్ల మీనాక్షి, బోయ కళావతి, సుకన్య, సువర్ణ, మేకల విమల, ఫాతిమాబీ, మౌళాబీ, వెంకటేశ్వరమ్మతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు రైల్వే కాలనీలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా మహిళా కౌన్సిలర్లు, నాయకులు ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు బుర్రు శ్రీధర్, రమణ, కౌన్సిలర్ రైల్వే నాగేంద్ర పాల్గొన్నారు.

మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతివ్వండి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసి పేదలకు మంచిచేసిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ మద్దతు ఇవ్వాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ప్రజలను కోరారు. ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డితో కలిసి బుధవారం పట్టణంలోని పలు వీధుల్లో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు చేకూరిన లబ్ధి, జరిగిన అభివృద్ధిని వారు ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఇబ్బందులు తెలుసుకొని, వారి బాగుకోసం ఎన్నో ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకొని సంక్షేమ పాలనను అందించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రజల వద్దకే పాలన సాగించిన జగన్ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కాటసాని రామిరెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామప్ప, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి వెంటకేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వందమంది మహిళలు



కాటసాని జయమ్మ, మేధాశ్రీరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బనగానపల్లె పట్టణ మహిళలు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని టీడీపీకి చెందిన దాదాపు వందమంది మహిళలు బుధవారం ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కోడలు కాటసాని మేధాశ్రీరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలకు పార్టీ కండువావేసి సాదరంగా వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాటసాని జయమ్మ, మేధాశ్రీరెడ్డిలు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లిం సోదరులకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ తనయుడు సీఎం వైఎస్ జగన్ ముస్లిం సోదరులకు మరిన్ని పథకాలను అమలు చేస్తూ అండగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కాటసాని రామిరెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు.

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



శంకరాపురంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ ప్రజలను కోరారు. బుధవారం మండల పరిధిలోని శంకరాపురంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, నాయకులు జయప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కాటసాని రామిరెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలోసింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, శేఖరయ్య , శేషిరెడ్డి, రమణారెడ్డి, రామచంద్రుడు, సుబ్బారెడ్డి , ఎద్దులన్న, సీతారామాపురం, గోరుమానుకొండ సర్పంచ్‌లు వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నామినేషన్ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ఇంటి వద్ద కార్యకర్తల సందడి



నామినేషన్ కార్యాలయానికి వెళ్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కాటసాని రామిరెడ్డి నామినేషన్ దాఖలు

బనగానపల్లె : బనగానపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు ఆయన సతీమణి కాటసాని జయమ్మ బుధవారం తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ కామేశ్వరావుకు అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ దంపతులు స్వగృహం వద్ద వేదపండితుల ఆశీర్వాచనలు, గోమాతకు పూజలు చేశారు. అనంతరం తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తూ నామినేషన్ వేసేందుకు కాటసాని కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. నామినేషన్ సందర్భంగా పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు కాటసాని ఓబుల రెడ్డి, కోడలు కాటసాని మేధాశ్రీరెడ్డి, వియ్యంకులు పెద్దిసాయిరెడ్డి, పెద్దిసుప్రియ రెడ్డి,ఆర్‌కే మోహన్ రెడ్డి, ఆర్‌కే సుధీర్‌రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి,కోవెలకుంట్ల మాజీ సర్పంచ్ న్యాయవాది వాసగిరి కృష్ణమూర్తి, న్యాయవాధులు రాజగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి,అబ్దుల్‌ఖైర్, అబ్దుల్‌ఫైజ్, జగన్నాథ్ రెడ్డి, గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, గాధంశెట్టివేనుగోపాల్, నూకల వెంకట సుబ్బయ్య, నూకలవిజయుడుతో పాటు అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్లె కోటపై వైఎస్సార్‌సీపీ జెండా మళ్లీ ఎగురవేస్తాం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : ధర్మానికి... అధర్మానికి, పేదలు... పెత్తందారులకు మధ్య జరిగే ఎన్నికల పోరాటంగా భావిస్తున్నామని, బనగానపల్లె కోటపై వైఎస్సార్‌సీపీ జెండా మళ్లీ ఎగురవేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్పష్టం చేశారు. బనగానపల్లె అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నామినేషన్ పత్రాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరావుకు కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదుసంవత్సరాల పాలన నవరత్నాల పేరుతో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. పార్టీలు, కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారని, అర్హులందరికీ న్యాయం చేశారన్నారు. ఈ నేపథ్యంలో తాము ఇంటింటికీ వెళ్లి ధర్మంగా ఓటువేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నామన్నారు. ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. గతంలో చంద్రబాబు 2014–2019 వరకు అధికారంలో ఉండగా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. వారికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. ప్రస్తుతం అధికారం కోసం చంద్రబాబునాయుడు సాధ్యంకాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని, బాబు మాటలు నమ్మేస్థితిలో ఓటర్లు లేరన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని, మళ్లీ వైఎస్ జగన్ సీఎం అవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, కోడలు మేధాశ్రీరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు పోచా శిలారెడ్డి, అవుకు, కోవెలకుంట్ల మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, బీవీ నాగార్జున రెడ్డి, కోవెలకుంట్ల పట్టణ మాజీ సర్పంచ్ వాసగిరి కృష్ణమూర్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

డోన్ రూరల్ : పట్టణంలోని కొండపేటకు చెందిన సుధాకర్ నుంచి 143 క్వాటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు బుధవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నామన్నారు. మద్యాన్ని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ చెప్పారు.

ఏజీపీగా అబ్దుల్‌ఖైర్ రాజీనామా

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ న్యాయ సలహాదారు పదవికి రాజీనామా చేసినట్లు బి అబ్దుల్‌ఖైర్ బుధవారం తెలిపారు. ఈ మేరకు మంగళవారం తన రాజీనామా పత్రాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశానని చెప్పారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ పదవీకి రాజీనామా చేశానని తెలిపారు.


టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కాపులపల్లి గ్రామస్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని కాపుపల్లి గ్రామంలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు బుధవారం ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే స్థానిక స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాపుపల్లి గ్రామానికి చెందిన ముల్లాఇబ్రహీం, కోవెలకుంట్ల జిలాన్, మహమ్మద్ అల్తాఫ్, నన్నేరఫీ, ముల్లాసాదక్, నన్నేజబిబుల్లా, ముల్లా ఇమ్రాన్, మహమ్మద్‌హుస్సేన్, మిద్దె చిన్న ఓబులేసులు తదితరులకు కాటసాని వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి తగిన న్యాయం చేస్తామని, వైఎస్సార్‌సీపీ విజయానికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, చిన్నపుల్లయ్య, నీలి నాగేశ్వర రావు, చిన్నదస్తగిరి, నామాల శ్రీనివాసులు మెకానిక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన బెలుం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు



కాటసాని ఓబులరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బెలుం గ్రామస్తులు

బనగానపల్లె రూరల్ : కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాలు బుధవారం ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెలుంకు చెందిన భూషన్న సుబ్బారావు, పుల్లయ్య, మారం ఓబులేసు, చెన్నయ్య విజయ్, దస్తగిరి డేవిడ్, శాంతయ్య, బాబు మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరారు. కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, దస్తగిరి రెడ్డి, శివ సుబ్బయ్య, చంద్రారెడ్డి పలుకూరు బాషా తదితరులు పాల్గొన్నారు.